"నీ రిక్షాలో పార్సెలు పెడితే నేను కూచోడానికి సదుపాయం లేదు. పోనీ పార్సెలు ఒకటే పెట్టి నేను నడిచి వస్తే నువ్వు దారి తెలియక ఆ పార్సెలు ఎటో పట్టుకుపోవచ్చు. అప్పుడు నీ అడ్రస్ కోసం నేను పోలీసుల చుట్టూ తిరగాలి" అని నేనన్నాను.

"ఇయాల జనవరి ఫస్టు. ఇదే బోణీ బేరం. ఇదిగాని ఒగ్గేస్తే ఈ ఏడాదంతా నాకు బేరమే రాదు" అన్నాడు రిక్షా అబ్బాయి.

ఉగాది లక్షణాలు జనవరి ఫస్టుకి కూడా వస్తున్నాయని, ఇంకా తీవ్రతరంగా ఒచ్చేస్తున్నాయని, ఈ అర్థంలేని సంప్రదాయాలకి వ్యతిరేకంగా ఏదైనా చెయ్యాలని, కనీసం ఏదైనా అనాలని నాకు కూడా ఆవేశం వచ్చింది. "నయమే! నీ బోణీకోసం నేనీవేళ ఈ సామాను బండి ఎక్కితే ఇంక ఏడాదంతా నాకు ఎక్స్‌ప్రెస్సుల్లోనూ పాసింజెర్ రైళ్ళలోనూ బస్సుల్లోనూ ప్రయాణం చేసే అదృష్టం ఉండదు. గూడ్స్ ట్రెయిన్లూ, లారీలే గతి! నా సంగతి కూడా ఆలోచించు మరి!" అని ఆటో ఎక్కి కూర్చుంటూ "పాపం, నాకోసం కాలుస్తూ కాలుస్తూ ఉన్న బోణీ బీడీ పారేసేవు. ఓ కట్టకొనుక్కో." అన్నాను. (రిక్షా జర్నీ కేన్సిలేషన్ ఫీజు అర్ధరూపాయి చాలదంటారా?)

★

# 52. సహదేవ వైద్యం

**సు**మారు పాతికేళ్ల కిందట నేను విజయనగరం సర్వే పార్టీ ఆఫీసులో టెక్నికల్ సెక్షన్ల అజమాయిషీలో (అసిస్టెంట్ మేనేజర్‌గా) ఉండేవాణ్ణి. లంకవీధిలో మేం ఉన్న ఇంటికి పెరటివేపు వీధిలో సరిగ్గా మా ఇంటి పెరటి గేటుకి ఎదురుగుండా వుండే ఇంట్లో సంగీతం కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారం భావనారాయణ రావుగారు ఉండేవారు. సాహిత్యంలోనూ సంగీతం లోనూ నాకున్న లోతైన అభిరుచిని ప్రశంసిస్తూ ఆయన నన్ను సంగీతం నేర్చుకోమనీ, తెలుగు ఎం.ఏ. పరీక్షకి కట్టమని ప్రోత్సాహించేరు. సంగీతం నేర్చుకోడానికి మేడేపల్లి నరిసింగరావుగారి దగ్గరా, తెలుగెమ్మే గైడెన్స్‌కోసం పమిడిపాటి వెంకటరమణయ్యగారి దగ్గరా చేరేను. రమణయ్య మేష్టారు బహువ్యాపక ధారి. ఒక టైముకి దొరకడం, ఒక పద్ధతి ప్రకారం పాఠం చెప్పడం (కాలేజీలో ఎలా చేసేవారో గాని) రూములో మాత్రం సాగేది కాదు. అయితే దొరికేరంటే మాత్రం ఆయన చూపించే శ్రద్ధా ఏకాగ్రతా అనన్య సాధ్యం. మా హైస్కూలు రోజుల్లో మోడేకుర్తి కామేశ్వరరావుగారు హిస్టరీ; గజవల్లి చిదంబర రావుగారు కెమిస్ట్రీ; మెత్త మెత్తగా ముద్దు ముద్దుగా చెప్పేవారు; అరటిపండు వొలిచి ఇచ్చినంత సుళువుగా మింగుడైపోయేది. కాని ఈ రమణయ్య మేష్టారు కసిరి కొట్టినంత పనిచేసి చెప్పి ఇలా కూడా పాఠం బోధపరచువచ్చునని రుజువు చేసేరు. చిన్నయసూరి బాల వ్యాకరణం, భండార్కరు సంస్కృత వ్యాకరణం రమణయ్య మేష్టారు చెప్పకపోతే ఈ ఎమ్మేకొకక దండంరా బాబూ అని ఎగ్జెంప్షెన్ ఫీజు సంగతి మరచిపోయి ఎప్పట్లా కథలూ కాకరకాయలూ చదువుకునేవాణ్ణే. ఇద్దరం కలిసి నాటకం చూడ్డానికి హస్తబల్ హాల్లో ఆడియన్స్‌లో కూర్చున్నా, విశాఖపట్నం వెళ్లాలని బస్సెక్కినా అచ్చు పుస్తకం అవసరం లేకుండా తెలుగు వాఙ్మయ చరిత్రా రఘువంశం చెప్పగల దిట్ట; ఆయన. ద్వారం దుర్గాప్రసాదరావుగారు, శాయికృష్ణ అనే కే- ఎస్సెన్-పట్నాయక్ గారూ (అప్పుడప్పుడు ఏ యశ్వీ రమణారావుగారూ) పేకాటలో కూర్చోబెట్టినా

ఈ పక్కనించి రమణయ్య మేష్టారు నాకు వసు చరిత్రలో పద్యాలమీద ఎమ్మే శ్టాండర్డులో నోట్సు చెప్పగలిగేవారు. అలా అలా ఎమ్మే ప్రీవియస్ అయిందనిపించేను.

సదరు ఎమ్మే ప్రీవియస్ పరీక్షకి మరింత ఏకాగ్రంగా సిద్ధం కావడానికైతేనేం, యూనివర్సిటీలో రెగ్యులర్ స్టూడెంట్సుని కొందర్ని సంప్రదించే వీలుకోసమైతేనేం; పరీక్షలు నెల్లాళ్లున్నాయనగా సెలవుపెట్టి విశాఖపట్నం చేరాను. దాంతో ఆఫీసులో నా పోస్టులో ఎవర్నో వేసేసి; నేను జాయినయ్యే వేళకి నాకు విజయనగరం నుంచి ఉద్వాసన చెప్పేసేరు. అలా అని, సెలవు అనంతరం ఫలానా చోట జాయినవమని ఆర్డర్సూ ఇవ్వలేదు. ఎవర్నో సలహా అడిగితేనూ, హైదరాబాదు వెళ్లి డైరెక్టరేట్లో రిపోర్టవండి; 24 గంటల్లో పోస్టింగ్ ఇస్తారు; అని చెప్పేరు.

సరే కదా అని హైదరాబాదుకి ప్రయాణం కట్టేను. ఆ రోజుల్లో ఇప్పట్లాగ సాయంకాలం నాలుగున్నరకి ఎక్కితే తెల్లారేసరికి దింపేసే గోదావరి ఎక్స్‌ప్రెస్సు లేదు. విజయనగరం నుంచి 24 గంటలు ఏక ప్రయాణమే. ఆ రైల్లో నాతోబాటు చాలా దూరం ప్రయాణం చేసిన శాయినాథశాస్త్రిగారు నా వేదన విని "ఎలాగా ట్రాన్స్‌ఫరు తప్పదంటున్నారు కనక, ఎవర్నయినా లేపేసి అయినా సరే; విశాఖపట్నం వేయించుకోండి'' అన్నారు.

"ఆ లెఖ్ఖని విజయనగరంలో నా బదులు ఒచ్చినాయన్నే లేపేస్తే ఫైనలియర్‌లో కూడా రమణయ్య మేష్టారి సాయం ఉంటుంది కదా!'' అన్నాను.

"ఫైనలియర్‌లో లింగ్విస్టిక్స్ (భాషా శాస్త్రం) ఉంటుంది. అది రమణయ్య చెప్పలేడు. ఒకవేళ చెప్పినా అతనికి ఇష్టం లేని సబ్జక్టు అవడంవల సమంగా చెప్పలేడు. మీరు విశాఖపట్నం వేయించీసుకుని ద్రోణప్పగారి శిష్యులు కావడమే ఫైనలియర్‌కి మీకు తరుణోపాయం.''

తీరా నేను హైదరాబాదు వెళ్లేసరికి అంతకి ముందు రోజే తయారైపోయిన ఆర్డర్ కాపీ ఒకటి చేతిలో పెట్టేరు; మా డైరెక్టరేట్ వారు. దాని ప్రకారం నేను పార్వతీపురం తాలూకా గుమ్మలక్ష్మీపురంలో జాయిన్ అవ్వాలిసుంది. ఈ స్థలం విజయనగరం నుంచీ సమారు వంద కిలోమీటర్లుంటుంది. విశాఖపట్నం నుంచైతే 150. అక్కడ గానీ ఇరుక్కుపోతే భాషాశాస్త్రం పాఠాలకంటే కష్టమైన 'ఉద్యమ పాఠాలు' నేర్చేసుకుని - తీవ్రమైన 'సామాజిక స్పృహ'తో నా స్వరూప స్వభావాలే మారిపోవచ్చు..

అంచేత ఆ ఆర్డరు పట్టుకుని మెట్లు దిగిపోకుండా మా జాయింట్ డైరెక్టర్ కస్తూరి గార్ని చూస్తానన్నాను. ఉదయం ఇంకా పదిన్నరే అయింది టైమ్. ఆయనొచ్చేసరికి పదకొండు కావచ్చునన్నారు. సరే అని మెయిన్‌గేటు దగ్గిర కాపలా కాసేను. నా అదృష్టం బావుండి, ఆయన 10-45 కే ఆఫీసుకొచ్చేరు. ఆయనగారు కారు పార్కింగులో పెట్టేసరికి అక్కడికి చేరి నమస్కారం చేసేను. ఆయన నన్ను ఎగాదిగా చూసి "పోస్టింగ్ కోసం ఒచ్చేవా? ఇచ్చీశామే! ఆర్డర్ డిశ్పాచి సెక్షన్‌లో ఉంటుంది, తీసుకో!'' అన్నారు, ఆఫీసు మెట్లు ఎక్కుతూ.

"తీసుకున్నానండి. గుమ్మలక్ష్మీపురం వేసేరు'' అన్నాను.

ఆయన ఒకసారి వెనక్కి తిరిగి చూసి "పో. నేను బిజీగా ఉన్నాను'' అన్నారు ముందు కెళిపోతూ ఎదురొచ్చే వాళ్ల గుడ్మార్నింగులు అందుకుంటూ-

నేను చొరవగా ముందుకి వెళ్లి అడిగేను, "సార్....నేను ఎమ్మే ఫైనల్‌కి వెళ్లాలి సార్...ఆ

పల్లెటూళ్లో అయితే చదువు సాగదు సార్....పైగా లింగ్విస్టిక్సు -ప్రొఫెసర్‌గారు చెప్తే తప్ప బోధపడదు సార్...దయచేసి ఒక్క ఏడాదిపాటు నాకు వైజాగ్ వెయ్యండి సార్....అప్లికేషన్ కూడా రాసి తెచ్చేను సార్."

"నీ సొమ్మేం పోయింది, ఏదైనా రాస్తావు. అయినా నువ్వు ఎమ్మే చదివేది దేనికి? బియ్యే పాసై కతలు రాశావు. ఎమ్మే పాసై పాటలు రాస్తావంటా? అరే; పో, ప్పా!"

"ఎలాగో తమరే ఆదుకోవాలి సార్. అప్లికేషన్ రాసేను సార్. స్వంత ఖర్చుల్తో జాయినవుతాను సార్. టి.ఏ. వదులుకుంటాను సార్!"

"అరె, ఎన్నిసార్లయ్యా చెప్పేది?" అని మా జె.డి. కస్తూరి గారు ఎదురుగా వచ్చిన ఒకాయన్ని ఒక వేలితో పిలిచి "ఈ నేదో అప్లికేషనిస్తాడంట; తీస్కో." అని చెప్పి లోపలికి వెళ్లిపోయారు.

ఆయన శ్రీరాములుగారు. నాన్ధాయి ఉద్యోగుల ట్రాన్స్ఫర్లూ, ప్రమోషన్లూ, సెలవు వ్యవహారాలూ చూసే సెక్షన్ సూపరింటు. నావేపు జాలిగా చూస్తూ అప్లికేషన్ తీసుకుని "రేపు సాయంకాలం రండి. బహుశా పని జరగదు. ఐనా చూద్దాం." అన్నారు; పాముచావకుండా కర్ర విరక్కుండా.

రెండు మూడు చోట్లకి వెళ్లి స్నేహితుల్ని పలకరించాలని అంతకి ముందు రోజు నుంచీ అనుకున్నా, మూడ్ చెడి; తిన్నగా మా తమ్ముడు కాపరం ఉన్న సనత్‌నగర్‌కి బయల్దేరాను. సరాసరి సనత్‌నగర్ వెళ్లే ఓ బస్సు దొరికింది గానీ, పంజాగుట్ట దగ్గిర ఆ బస్సు చెడిపోయింది. అమీర్‌పేట దాకా నడిచిపోతే అక్కడ వేరే బస్సు దొరుకుతుంది." అని అనుకొంటూ ఎవరో దారితీస్తే నేనూ అసంకల్పితంగా ఫాలో అయిపోయేను.

వందగజాలు నడిచేసరికి నా వెనకగా తీవ్రమైన కారు హారన్. వెంటనే నన్ను రాసుకుపోతున్నట్టుగా కారు; ఆగింది.

పక్కకి గెంతి కార్లోకి చూశాను.

సహదేవరావు - స్వయంగా కారు నడుపుకుంటూ -

ఆశ్చర్యం!

నన్ను చూసి, వెనక నించే నేనెవరో పోల్చుకుని, కారు ఆపేరన్నమాట. "రా" అని ఎడంవేపు తలుపు క్లిక్కు మనిపించి తెరిచి తలుపును నావేపు తోశాడు.

క్వార్టర్స్‌లో ఉన్నారు. మేడమ్ - ఊళ్లో లేనట్టుంది. "కమాన్. ఇప్పుడు పదకొండున్నరైంది, టైం. మనం కబుర్లు చెప్పుకుంటూ వంట చేసుకుని భోజనం చేసి రెండు గంటలకి ఆఫీసుకెళ్దాం. నిన్ను మా జాయింట్ సెక్రటరీ గారికి పరిచయం చేస్తాను. ఆయనకి రచయితలంటే పిచ్చి-"

అంటూ ఏమిటేమిటో మాట్లాడేస్తున్నాడు.

"నాకేం భోజనం ఒద్దు. అంతగా కావాలంటే వంటలో సాయం చేస్తాను. నువ్వలా కూచుంటానంటే అసలు నేనే వండేస్తాను" అన్నాను.

"నాన్‌సెన్స్, కలిసే వండుదాం, కలిసే భోం చేద్దాం, అసలు నువ్వెక్కడున్నావు; ఎప్పుడొచ్చేవు? కబుర్లు చెప్పు."

"అదంతా ఒక పెద్ద పీడకల" అని నా నిరాశావహమైన కథ అతి కొంచెం చెప్పి ఊరుకున్నాను. "బాత్‌రూం-" అన్నాను, టాపిక్ మార్చాలని.

నేను బాత్రూం నుంచి వచ్చేసరికి కూర పోపుకి రడీగా వుంది. సహదేవరావు తన బెడ్రూం నుంచి ఫోన్‌లో ఎవరిమీదనో అరుస్తున్నాడు. కూర సంగతి చూసేసరికి వచ్చాడు.

"అలా అరవాల్సిందేనా?" అన్నాను.

"రొటీన్. అంతా రొటీన్! అరవక పోతే కొన్ని పన్లు అవవు."

రెండు గంటలకి సహదేవరావు ఆఫీసు (సెక్రటేరియట్) పరిచయాలు. ఫైళ్లు చూస్తూ సహదేవరావు జోకులు, ఫోన్ కాల్సు. "జస్ట్ మినిట్లు", టైం నాలుగయ్యేసరికి కాఫీలు.

"ఓకే. పద!" అని సహదేవరావు లేచాడు. మళ్లీ అతనే కారు నడిపేడు. నడిపీ నడిపీ మా డైరెక్టరు ఆఫీసు వద్ద కారు ఆపేడు. నన్ను కార్లో కూర్చోమని తను లోపలికెళ్లేడు.

రెండు నిమిషాల్లో రెండు కవర్లు చేత పుచ్చుకుని వచ్చి కార్లో కూర్చున్నాడు సహదేవరావు.

రెండు కవర్లూ నాకే ఇచ్చేశాడు.

"అది నీ ఆర్డరు, నిన్ను విశాఖపట్నం కలెక్టరాఫీసులో వేశారు. రెండో కవరులో కలెక్టర్ కాపీ ఉంది. వెళ్లి జాయినైపో. కారు దిగి నీ దార్ని నువ్వు వెళ్లు. నాకు పనుంది."

కారు దిగి - అన్నమాట మాత్రం అర్థమైంది. దిగాను. సహదేవరావు తలుపు మూశాడు.

"అది కాదూ, -" అన్నాను.

"అదంతే. నువ్వు బాత్రూం కెళ్లినపుడు నువ్వు అక్కడ వదిలిన కాగితం చూశాను.ఫోన్‌లో కథంతా నడిచింది. మీ జాయింట్ డైరెక్టర్ వేసిన ఆర్డర్స్‌ని మీ డైరెక్టరు చేత మార్పించేను. ఆఫ్‌కోర్స్; నువ్వు నన్ను అడిగుంటే చేసుండకపోదును. విష్ యు బెస్టాఫ్ లక్."

కారు కనుమరుగైంది; కళ్లు బైర్లు కమ్మి. కాదు. కారు నిజంగానే వెళ్లిపోయింది.

"న-న-నమస్కారం సార్!" అన్నాను అప్రయత్నంగా, ఎదుట ఇంకో కారు దిగిన మా జాయింట్ డైరెక్టర్‌గారు కనబడగానే.

"పోవయ్యా, పో! ఆర్డర్ తీస్కో పో. చెప్పించావుగా ఎవుడో మినిష్టరుతో!" అన్నాడు కస్తూరి పేరుగల జె.డి. గారు మొహం మాత్రం చిరాగ్గా పెట్టి. ★

# 53. నేతాజీకి దండ

**1970**ల్లో ఒక రోజున నేను హైదరాబాద్‌లో ఏదో పనిమీద వెళ్లి ఉండగా; విజయనగరం కాలేజీలో నాకు రెండేళ్ళు సీనియర్ అయిన లక్ష్మణరావు చాలా యాదృచ్ఛికంగా తగిలేడు. నేను ఇటువేపు వెళ్లడానికని ఒక బస్సుస్టాపులో నిలబడి ఉంటేను, అటువైపు వెళ్తున్న ఓ కారు; ముందుకి వెళిపోతూ చటుక్కున ఆగింది. ఆ కారు డ్రయివరు ఒక తమాషా అయిన ఈల లాంటిది వేస్తే బస్సుస్టాపులో నిలబడ్డ వాళ్లలో సగంమంది అటు చూసేరు.